'పది'కి పక్కా ప్రణాళిక

- ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన
- విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ


మొగుళ్లపల్లి పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

మొగుళ్లపల్లి: పదో తరగతిలో 10 జీపీఏ సాధించేందుకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. మార్చి 18 నుంచి ప్రారంభం కానున్న వార్షిక పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా మోడల్ స్కూల్, కస్తూరిబా విద్యాలయం, ఎంజేపీలో కలిసి మొత్తం 10 ప్రభుత్వ హైస్కూల్ పాఠశాలల్లో పదోవ తరగతి విద్యార్థులు మొత్తం 296 మంది ఉన్నారు. ఉపాధ్యాయులు నిత్యం పాఠశాలను పర్యవేక్షించడంతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్నారు. గతేడాది కంటే ఈ సారి మెరుగైన ఫలితాలు సాధించాలనే దిశగా ప్రయత్నిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయడంతో పాటు ప్రతీ రోజు నాలుగు గంటల పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ ఒక సబ్జెక్ట్‌కు సంబంధించిన ఉపాధ్యాయుడు ప్రత్యేక తరగతి నిర్వహణతో పాటు స్టడీ అవర్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు. స్టడీ అవర్స్‌తో విద్యార్థులకు కలిగిన సందేహాలను నివృత్తి చేయడంతో విద్యార్థుల్లో మనోధైర్యం కలుగుతుంది దీంతో ఎలాంటి భయం లేకుండా విద్యార్థులు పరీక్షలకు హాజరై మంచి ఫలితాలు సాధిస్తారని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్‌కు ఒక విద్యార్థికి రోజుకు రూ.15లు చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.

మెరుగైన ఫలితాలు సాధిస్తాం..



కొన్ని సంవత్సరాలుగా మంచి ఫలితాలు సాధిస్తున్నాం. ఈ విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి మండల టాపర్‌గా నిలవడం కోసం ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తున్నారు. వంద శాతం ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధిస్తాం.

– విజయపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, మొగుళ్లపల్లి హైస్కూల్

స్టడీ అవర్స్‌తో మేలు



స్టడీ అవర్స్, ప్రత్యేక శిక్షణ తరగతులతో విద్యార్థులకు చాలా మేలు కలుగుతోంది. స్టడీ అవర్స్ చేయించడం వలన ఏకాగ్రత దెబ్బతినకుండా చదువుపై శ్రద్ధ పెట్టడానికి విద్యార్థులకు వీలు కలుగుతుంది. ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు అడిగిన ప్రశ్నలను నివృత్తి చేస్తున్నాం.

– కుమారస్వామి, గణిత ఉపాధ్యాయుడు, మొగుళ్లపల్లి

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పరీక్షల సమయంలోనే కాకుండా మొదటి నుంచి ప్రణాళిక పరంగా పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలి. మండలంలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

– ప్రభాకర్, ఎంఈఓ మొగుళ్లపల్లి

గిరిజనేతరులకు ఇళ్లు ఇస్తే అడ్డుకుంటాం..


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం ఇస్తే అడ్డుకుంటామని ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు అన్నారు. ఆదివారం మండల పరిధిలో ఒంటిమామిడి గ్రామంలో ఆదివాసీ నవ నిర్మాణ సేన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి గిరిజనుల సమాధులపైనే జరుగుతుందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ఆదివాసీ జీవన విధానం అథమ స్థాయికి చేరుకుందని అన్నారు. 1/70 చట్టం అమలులో ఉన్న భద్రాచలం ఏరియాలో గృహలక్ష్మి ఇళ్లు ఏలా మంజూరు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ ఏరియాలో గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుంజా మహేష్, పోతురాజు, గోపి, గణేష్, రాజు తదితరులు ఉన్నారు.

ఎంపీ టికెట్ ఆదివాసీలకు ఇవ్వాలి


మాట్లాడుతున్న చందా లింగయ్యదొర

ఎస్ఎస్‌తాడ్వాయి: మహబూబాబాద్ పార్లమెంట్ టికెట్ అన్ని రాజకీయ పార్టీలు ఆదివాసీలకే ఇవ్వాలని జాతీయ అఖిలపక్ష, ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు చందా లింగయ్యదొర డిమాండ్ చేశారు. ఆదివారం మేడారంలో ఆదివాసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం 2009లో ఏర్పాటు చేసినప్పటి నుంచి లంబాడ సామాజిక వర్గానికి మాత్రమే ప్రధాన రాజకీయ పార్టీలు టికెట్ ఇస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గంలో ఆదివాసీలు, కోయ, నాయకపోడ్ తెగల వారు దాదాపు 3లక్షల పైగా ఓటర్లు ఉన్నారన్నారు. ప్రధాన పార్టీల్లో పని చేస్తున్న ఆదివాసీ రాజకీయ నాయకులకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం అవమాన పరచడమేనన్నారు. రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ ఆదివాసీలను విస్మరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, కోకన్వీనర్ పోడెం రత్నం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, టీడబ్ల్యూటీయూ గౌరవ అధ్యక్షుడు పాడెం కృష్ణప్రసాద్, ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటి రవి, ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐలబోయిన వీరయ్య, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్కా యాదగిరి, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్దన్, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేష్, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి

మొగుళ్లపల్లి: జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ రాము ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంవత్సరానికి 100 రోజులు పనిని ఉపయోగించుకోవాలని మండలంలోని అన్ని గ్రామాల్లో ఫీడర్ కాల్వలు పూడిక తీత, చెరువుల పూడికతీత ఉపాధి హామీ పథకంలో పనులు జరుగుతున్నాయన్నారు. బ్యాంక్ అకౌంట్, లేదా పోస్టాఫీస్ అకౌంట్‌కి ఆధార్ లింక్ చేసుకోవాలన్నారు.

ఘనంగా వసంతోత్సవం



వాజేడు: మండల పరిధిలోని ప్రగళ్లపల్లి గ్రామంలో ఆదివారం వసంతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామంలోని శివాలయం నుంచి సతీ సమేతంగా స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

చిట్యాల: మండల కేంద్రంలోని సాంఘిక గురుకుల ప్రభుత్వ సంక్షేమ బాలికల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సైనిక పాఠశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి మాట్లాడుతూ.. మొత్తం 164 మంది విద్యార్థులకు 148 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి ఘర్షణలు జరుగకుండా ఎస్సై గంధమనేని శ్రావణ్‌రావు పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కమిటీ ఎన్నిక


సారంగపాణి, అధ్యక్షుడు


బుచ్చిరెడ్డి, ప్రధానకార్యదర్శి

గోవిందరావుపేట: మండల కేంద్రంలో మండల ప్రెస్ క్లబ్ కమిటీని సీనియర్ పాత్రికేయులు ఆకుల యుగేందర్, నెక్కంటి సునీల్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మోడెం సారంగపాణి, ఉపాధ్యక్షుడిగా అంకం వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సామ బుచ్చి రెడ్డి, సహాయ కార్యదర్శిగా పగడాల వాసు, కోశాధికారిగా బత్తిని వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తుక్కాని ఎల్లారెడ్డి, రఘువీర్, గుండెబోయిన అనిల్ కుమార్, వేముల సతీష్, జన్నారపు రమేష్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

రేగొండ: రేగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి సెల్ ఫోన్ పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుగొని తిరిగి అప్పగించినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి చెందిన ఆకుల వెంకటేష్ సెల్ ఫోన్ పోయిందని ఫిబ్రవరి 25న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విచారణ జరిపిన సిబ్బంది ప్రవీణ్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను కనుగొన్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వెంకటేష్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు



చిట్యాల: నూతనంగా వచ్చిన ఎస్సై గంధమనేని శ్రావణ్‌కుమార్‌ను నవాబుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో మోత్కూరి రంజిత్, నేరేళ్ల సమ్మయ్య, మోత్కూరి సాయికృష్ణ, తీగల నాగరాజు, పింగిలి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ సీనియర్ డ్రైవర్ శ్రీనివాస్ మృతి


శ్రీనివాస్(ఫైల్)

ఏటూరునాగారం: ఐటీడీఏలో సీనియర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న తాళ్లపల్లి శ్రీనివాస్(53)ఆదివారం మృతి చెందారు. కొంత కాలంగా శ్రీనివాస్ అనారోగ్యానికి గురికాగా ఇంటి వద్దనే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీనివాస్ మృతిపై ఐటీడీఏ అధికారులు, ఉద్యోగులు, స్నేహితులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

వృథాగా 'భగీరథ' నీరు


వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

రేగొండ(కొత్తపల్లిగోరి): మండల కేంద్రంలోని పోచమ్మ గుడి వద్ద గల వాటర్ ట్యాంక్ వద్ద పైపు లైన్ లీక్ కావడంతో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. పైప్ లైన్ లీకేజీతో పది రోజులు అవుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్షణమే లీకేజీ అరికట్టి మళ్లీ పునరావృత్తం కాకుండా సంబంధిత అధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ ఏఈ హరీష్‌ను వివరణ కోరగా లీకేజీల లోపాన్ని గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

అసాంఘిక శక్తులకు సహకరించొద్దు


మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వరరావు


కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

వాజేడు: అసాంఘిక శక్తులకు గ్రామస్తులు సహకరించొద్దని వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలోని బిజినేపల్లి గ్రామంలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్సై మాట్లాడుతూ.. అసాంఘిక శక్తులను గ్రామాల్లోకి రానివ్వొద్దని సూచించారు. అనంతరం మండల పరిధిలోని అరుణాచలపురం వద్ద వాజేడు, భద్రాచలం రహదారిపై వాహన తనిఖీలను నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని సోదాలు చేశారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు


తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

చిట్యాల: మద్యం తాగి వాహనాలను నడుపొద్దని ఎస్సై గంధమనేని శ్రావణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహనాదారులు అనుమతి పత్రాలు కలిగి ఉండాలని కోరారు. ద్విచక్ర వాహనదారుడు తప్పకుండా తలకు హెల్మెట్ ధరించాలని కోరారు.

సావిత్రీబాయి సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న నాయకులు

చిట్యాల: భారతీయ సంఘ సంస్కర్త తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే వర్ధంతిని మండల కేంద్రంలో ఆదివారం మండల ప్రధాన కార్యదర్శి మ్యాదరి సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మ్యాదరి సునీల్ మాట్లాడుతూ.. స్త్రీల హక్కుల కోసం సామాజిక ఉద్యమం చేసిన ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే అన్నారు. ఆమె చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు గురుకుంట్ల కిరణ్, గుర్రం తిరుపతి, గుర్రపు రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

23న అవగాహన సదస్సు


కరపత్రం ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

ములుగు రూరల్: తెలంగాణ స్కిల్స్, నాలెడ్జ్ సెంటర్, కళాశాల కెరీర్ గైడెన్స్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలపై ఈ నెల 23న కళాశాలలో నిర్వహిచనున్న ఉచిత మెగా అవగాహన సదస్సును అర్హత పరీక్ష రాయనున్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశం సూచించారు. ఈ మేరకు ఆదివారం కళాశాలలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. సదస్సులో పోస్టుల వివరాలు, అర్హతలు, పరిపాలన స్వభావం, పదోన్నతి అవకాశాలు, ప్రిలిమ్‌నరీ, మెయిన్స్ ప్రిపరేషన్‌పై విషయ నిపుణుల చేత వివరించబడుతుందని అన్నారు. సదస్సులో పాల్గొనే వారికి సిలబస్ కాపీ, స్టడి మెటీరియల్ అందించనున్నట్లు ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎండీ యాకూబ్ తెలిపారు. వివరాలకు 73964 93313, 99081 61151, 99501 65334 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి


భూపాపల్లి రూరల్: మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు


రేగొండలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి మాట్లాడారు. గతంలో ఎన్టీఆర్ ప్రభుత్వం మహిళలను గుర్తించి రిజర్వేషన్లు కల్పించి చట్ట సభల్లో అవకాశం కల్పించారన్నారు. ఆ రిజర్వేషన్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. మహిళల్లో కనబడని శక్తి దాగి ఉందని, పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. రాష్ట్ర మహిల శిశు గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క ఉక్కు మహిళ అని ఎందరికో ఆదర్శ ప్రాయమని కొనియాడారు. నియోజకవర్గంలోని మహిళలు సమస్యలకు భయపడవద్దని తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

రేగొండ(కొత్తపల్లిగోరి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. భాగిర్థిపేట క్రాస్ రోడ్డు గ్రామంలో ప్రహరీ నిర్మాణానికి రూ.4.95 లక్షలు, కొత్తపల్లి(బీ) గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10లక్షలు, జగ్గయ్యపేటలో ప్రహరీ నిర్మాణానికి రూ.4.95 లక్షలు, చిన్న కోడేపాకలో చెరువు మరమ్మతుకు రూ.3.63 కోట్లు, రూపిరెడ్డిపలిల్లో ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు, దమ్మన్నపేట చెరువు మరమ్మతు పనులకు రూ.49 లక్షలు, రేపాకలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి రూ.10లక్షలు, రేపాకపల్లిలో చెరువు మరమ్మతు పనులకు రూ.10 లక్షలు, కొడవటంచలో పీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు, మడ్తపల్లిలో చెరువు మరమ్మతు పనులకు రూ.1.5 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పున్నం లక్ష్మి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, పీఆర్ ఏఈ సతీష్‌బాబు, ఎంపీటీసీ దుగ్యాల సునీత కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, జిల్లా నాయకులు గుటోజు కిష్టయ్య, సూరం వీరేందర్, మేకల భిక్షపతి, ఉమేష్‌గౌడ్, మైస భిక్షపతి, బోయిని వినోద్ కుమార్, జూపాక అశోక్, బానోత్ రవీందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

'చిన్నచూపు చూస్తే సహించేది లేదు'


నిరసనలో పాల్గొన్న జిల్లా టీఆర్‌టీఎఫ్ సభ్యులు

ములుగు రూరల్: ఉద్యోగులను చిన్నచూపు చూస్తే సహించేది లేదని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోరిక సర్వన్ కుమార్ , అజ్మీరా రాజునాయక్ అన్నారు. ఉద్యోగులపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ హనుమకొండలోని కేయూ జంక్షన్ వద్ద నిర్వహించిన నిరసన, ధర్నా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ములుగు శాఖ తరపున అధిక సంఖ్యలో హాజరయ్యారు. వారి వెంట జిల్లా నుంచి పాడ్య శివరాం, పోరిక జయరాం, గోపిసింగ్, అజ్మీరా రాజు, పోరిక అనంతరాం, తదితరులు ఉన్నారు.

లక్నవరం చెరువు కింద అక్రమంగా సాగు


కాల్వకు గండి కొట్టి దారిమళ్లించిన నీరు

గోవిందరావుపేట: లక్నవరం చెరువు కింద అక్రమంగా సాగుచేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో యాసంగి సీజన్‌లో కోట కాల్వ కింద రొటేషన్ పద్ధతిలో 21,00 ఎకరాలకు సాగు నీరు ఇచ్చారన్నారు. కానీ అదనంగా మరో 20,00 ఎకరాలు పంట అక్రమ సాగు దారులు క్వాలలకు మోటార్లు పెట్టి సాగు చేస్తున్నారు అని ఆరోపించారు. సద్దిమడుగు గేజ్ చేసి నరసింహుల కాలువ అలుగు పగులగొట్టి అక్రమంగా చెరువు నీళ్లు తీసుకుపోతున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారన్నారు. అధికారుల ప్రమేయంతోనే జరిగుతుందని వాపోయారు. దీనిపై విచారణ జరిపించి వెంటనే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకొవాలని విజ్ఞప్తి చేశారు. కోట కాలువ కింద నీరు లేక పొలాలు ఎండిపోతే అందుకు బాధ్యత కూడా అధికారులదేనని హెచ్చరించారు. కలెక్టర్ తక్షణమే స్పందించి పై విషయాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సప్పిడి యాదిరెడ్డి, వల్లపునేని రవి, ఏనుగు సుధాకర్, సామ శ్రీనివాస్ రెడ్డి, మోపిదేవి వేణు తదితరులు పాల్గొన్నారు.

16న లోక్ అదాలత్

మొగుళ్లపల్లి: జిల్లా కోర్టులో ఈనెల 16న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై తీగల మాధవ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భార్యభర్తల మధ్యగల వివాహ సంబంధమైన వివాదాలు, విడాకులు, పిల్లల మనోవర్తి, చెక్ బౌన్స్, భూవివాదాలు, అన్నిరకాల సివిల్ కేసులు, పలు క్రిమినల్ కేసుల్లో సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌లో పాల్గొనాలని పేర్కొన్నారు. వివరాలకు నంబర్లను 87126 58126, 96033 96097, 87126 58147 సంప్రదించాలన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న చిటమట రఘు

ఏటూరునాగారం: మండల పరిధిలోని షాపెల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో పది లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ ఖలీల్‌ఖాన్, ఎండీ గౌస్ పాషా, మాజీ సర్పంచ్ చేల వినయ్, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపండల రవి, తాల్లపల్లి నరేందర్, రాములు, బక్కయ్య, నర్సింహారావు ఉన్నారు.